సాక్షి
అనంతపురం
బుధవారం । 5 । ఏప్రిల్ । 2023



చీనీ టన్ను రూ.30 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.30 వేలు లికాయి.



టమాట కిలో రూ.12

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.12, కనిష్టంగా రూ.3, సరాసరిన రూ.6 పలికింది.



జిల్లా అంతటా మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఎండలు పెరగడంతో ఉక్కపోత కొనసాగుతోంది.



కౌంటర్‌కు బదులేదీ?

- 'యువగళం'లో లోకేష్ అవాకులు చెవాకులు
- టీడీపీ నేతల స్క్రిప్టులతో అధికార పార్టీ ఎమ్మెల్యేలపై ఆరోపణలు
- రుజువు చేయాలంటూ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేల బహిరంగ సవాల్
- నిరూపణ చేయలేక ముఖం చాటేస్తున్న ప్రతిపక్ష పార్టీ నాయకులు
- పాదయాత్ర నియోజకవర్గం దాటగానే ఆరోపణల ఊసెత్తని లోకేష్



కృష్ణా కరకట్టపై చంద్రబాబు నివాసముంటున్న అక్రమ కట్టడం చూపుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: యువగళం పాదయాత్రలో నారా లోకేష్ చేస్తున్న ఆరోపణలు తెలుగుదేశం పార్టీని అభాసుపాలు చేస్తున్నాయి. స్థానిక నేతలు ఇచ్చిన స్క్రిప్టును చదివి వ్యాఖ్యలు చేయడం.. ఆ తర్వాత ఆరోపణలు రుజువు చేయాలంటూ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు సవాల్ విసిరితే టీడీపీ నుంచి స్పందన లేకపోవడం.. ఇదంతా చూస్తుంటే 'యువగళం' మసకబారిందన్న భావన వ్యక్తమవుతోంది. లోకేష్ విమర్శలకు స్థానిక నాయకులు కూడా కనీస ఆధారాలు చూపించలేక ముఖం చాటేస్తున్నారు.

రోడ్లపై చర్చకు రెడీయా..?

కదిరిలో రోడ్ల అభివృద్ధి జరగలేదని, ఉన్నవన్నీ టీడీపీ వేసిన రోడ్లేనని లోకేష్ వ్యాఖ్యానించారు. 'మీ నాన్న 14 ఏళ్లు సీఎంగా ఉన్నారు. జగన్ ఇప్పటికి సీఎంగా ఉన్నది నాలుగేళ్లే. ఆ పద్నాలుగేళ్లు.. ఈ నాలుగేళ్లు తీసుకో. ఎవరి పాలనలో ఎక్కువ రోడ్లు వేశారో చూద్దాం. దీనికి నువ్వు రెడీ అయితే చర్చకు ఎక్కడైనా నేను సిద్ధమే. ఊరికే రోడ్డుమీద పదిమందిని పోగేసుకుని మాట్లాడటం కాదు. వేసిన రోడ్లు.. ఖర్చుచేసిన వ్యయం లెక్కలతో రా. నేనూ వస్తా.. తేల్చుకుందాం' అంటూ కదిరి ఎమ్మెల్యే సిద్దారెడ్డి చేసిన సవాల్‌కు టీడీపీ నుంచి ఎవరూ ముందుకు రాలేదు.

దమ్ముంటే సవాల్ స్వీకరించండి

ధర్మవరంలో ప్రభుత్వ భూములు ఆక్రమించారని ఆరోపణలు చేసిన లోకేష్‌కు...ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి గట్టి షాకే ఇచ్చారు. మీరు చేసిన ఆరోపణలు రుజువు చేయాలని ఈ నెల మూడో తేదీన విజయవాడలోని కరకట్ట సమీపంలో ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబు ఇంటి వద్దకే వెళ్లారు. మీరు ఉంటున్నది అక్రమమా.. నేను నిబంధనల ప్రకారం చేసింది అక్రమమా? దమ్ముంటే చర్చించేందుకు రండంటూ కేతిరెడ్డి సవాల్ విసిరారు. దీనికి టీడీపీ నేతలెవరూ స్పందించలేదు.

జాకీపై చర్చకు నేను సిద్ధం

రాప్తాడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే కారణంగా జాకీ పరిశ్రమ వెళ్లిపోయిందంటూ లోకేష్ పాదయాత్రలో ఆరోపించారు. 'అప్పటి మంత్రి పరిటాల సునీత.. జాకీ పరిశ్రమకు అనుమతి వచ్చాక ఏడాది పాటు పదవిలోనే ఉన్నారు. ఎందుకు పరిశ్రమను ప్రారంభించలేకపోయారు? దీనిపై చర్చించేందుకు నేను సిద్ధం. పరిటాల కుటుంబమైనా.. లోకేష్.. చంద్రబాబు ఎవరైనా సరే చేతనైతే చర్చించేందుకు రండి..' అంటూ రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సవాల్ విసిరారు. కానీ ఎవరి నుంచీ సమాధానం రాలేదు.

చెంచాలు కాదు.. నువ్వే చర్చకు రా..!

'నేను భూకబ్జాలు, దోపిడీలు చేశానని అంటున్నావ్.. నా తాతది 50 ఎకరాలు. మీ తాత ఖర్జూరనాయుడు మీ నాన్నకు రెండెకరాలు ఇచ్చారు. మరి రెండు వేల కోట్ల రూపాయలు మీకు ఎక్కడ నుంచి వచ్చాయి? దీనిపై చర్చించేందుకు నీ చెంచాలు కాకుండా లోకేష్ నేరుగా రావాలి' అంటూ పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ సవాల్ విసిరారు. 'స్థలం, తేదీ నువ్వు చెప్పినా సరే.. నన్ను చెప్పమన్నా ఓకే.. నన్ను అనకొండ అన్నావ్.. నిజమే.. ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడంలో నేను అనకొండనే' అన్నారు. శంకరనారాయణ వ్యాఖ్యలకు ఇప్పటికీ టీడీపీ నుంచి జవాబు లేదు.

ఆరోపణలు రుజువు చెయ్

అవినీతి అక్రమాల్లో దిట్ట అని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిపై లోకేష్ నోరు పారేసుకున్నాడు. తనపై చేసిన ఆరోపణలు నిరూపించాలంటూ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి పట్టుపట్టారు. పరువు కాపాడుకునేందుకు, అల్లరి చేసి పబ్లిసిటీ చేసుకునేందుకు మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి పుట్టపర్తి సత్యమ్మ గుడివద్దకెళ్లి కవ్వింపు చర్యలకు దిగారు. కానీ దుద్దుకుంటపై చేసిన ఆరోపణలను నిగ్గుతేల్చలేక వెనుదిరిగారు. ఇప్పటికీ తాను విచారణకు సిద్ధమని, మీలో ఎవరైనా పుట్టపర్తి నడిరోడ్డులో బహిరంగ చర్చకు రావాలని దుద్దుకుంట సవాల్ చేశారు.

మైనర్ల మధ్య గొడవ.. ఒకరు మృతి



మృతుడు వడ్డే రాజశేఖర్

రాయదుర్గంటౌన్: ఇద్దరు మైనర్ల మధ్య జరిగిన గొడవలో తీవ్రంగా గాయపడి వడ్డే రాజశేఖర్(17) అనే బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన రాయదుర్గంలో మంగళవారం జరిగింది. సీఐ యుగంధర్ తెలిపిన వివరాల మేరకు...పట్టణంలోని పార్వతీనగర్‌లో నివాసముంటున్న బొమ్మలాట బ్రహ్మయ్య కుమారుడు బాలకృష్ణ స్థానిక కళ్లీమఠం మునిసిపల్ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. డ్రాప్ అవుట్ విద్యార్థిగా పాఠశాలలో చేరిన బాలకృష్ణ తరగతులకు సక్రమంగా హాజరుకావడం లేదు. మరోవైపు పాఠశాల ఎదురుగానే నివాసముంటున్న వడ్డే రాజశేఖర్ బడి మానేసి తల్లిదండ్రులతో కలిసి బెంగళూరుకు వలస వెళ్లి అక్కడే పనులు చేస్తుండేవాడు. ఇటీవల ఉగాది పండుగకు రాయదుర్గం వచ్చాడు. రెండు రోజుల క్రితం రాజశేఖర్, బాలకృష్ణ మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. ఇదే క్రమంలో మంగళవారం పార్వతీనగర్‌లో ఇద్దరూ తారసపడి మరోసారి గొడవపడ్డారు. బాలకృష్ణ కర్రతో రాజశేఖర్ తలపై దాడి చేయగా రక్తగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే రాయదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి అనంతపురం తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై రాజశేఖర్ తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

బీటెక్ ఫలితాల విడుదల



జేఎన్‌టీయూ పరీక్షల విభాగం

అనంతపురం సిటీ: జేఎన్‌టీయూ అనంతపురం విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన బీటెక్ రెండో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్20) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య కేశవరెడ్డి, కంట్రోలర్ డాక్టర్ బి.చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు వారు మంగళవారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఫలితాల కోసం వెబ్‌సైట్ http://jntuaresuts.ac.inను సందర్శించాలని సూచించారు.

న్యూస్‌రీల్

'ఉపాధి'లో 90 లక్షల పనిదినాలు



అనంతపురం టౌన్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2023–24 ఆర్థిక సంవత్సరంలో అనంతపురం జిల్లాకు 90 లక్షల పనిదినాలకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించినట్లు డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ప్రస్తుతం కేటాయించిన లేబర్ బడ్జెట్‌ను పూర్తి చేస్తే అదనపు పని దినాలను కూలీలకు కేటాయించనున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి పేర్కొందని చెప్పారు. దీంతో పాటు కూలీల వేతనాలతోపాటు మెటీరియల్ కింద దాదాపు రూ.400కోట్ల నిధులను కేటాయించినట్లు వెల్లడించారు. ఈ ఏడాది కూలీల వేతనాల చెల్లింపుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్)ను రూపొందించినట్లు తెలిపారు. దీంతో ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల వివరాలకు ఏ రోజుకారోజే సాఫ్ట్‌వేర్‌లో నమోదు అవుతాయన్నారు. ఈ నూతన విధానంతో కూలీల వేతనాలు సైతం సకాలంలో వారి ఖాతాల్లో జమవుతాయన్నారు. ఈ ఏడాది కూలీలకు సగటు వేతనం రూ.272గా నిర్ణయించినట్లు తెలిపారు. వేసవిలో గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకు విరివిరిగా పనులను కల్పించేలా ఉపాధి హామీ సిబ్బంది చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ముగిసిన ఇంటర్ మైనర్ సబ్జెక్టుల పరీక్షలు

రాప్తాడురూరల్: హమ్మయ్యా...ఇంటర్ మైనర్ సబ్జెక్టుల పరీక్షలూ మంగళవారంతో ముగిశాయి. మార్చి 15న ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు అదే నెల 29న జనరల్ విద్యార్థుల పరీక్షలు ముగిశాయి. పరీక్షల నిర్వహణలో ఏ చిన్న సమస్యా ఉత్పన్నం కాలేదు. ఇంటర్ బోర్డు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఈసారి ఒక్క మాల్ ప్రాక్టీస్ కూడా నమోదు కాకపోవడం విశేషం. ఆర్ఐఓ సురేష్‌బాబు మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లకూ తావులేకుండా పరీక్షలను పూర్తి చేయడం పట్ల ఆర్ఐఓ, డీవీఈఓ కార్యాలయాల సిబ్బంది, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. సహకరించిన పోలీసు, రెవెన్యూ, విద్యుత్, రవాణా, విద్యాశాఖ, పౌర సంబంధాల శాఖ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

కేంద్రీయ విద్యాలయ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి



గుత్తి: కేంద్రీయ విద్యాలయంలో 2023–24 సంవత్సరానికి గాను ఒకటో తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని గుత్తి కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ పీఎస్ వాసన్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఒకటో తరగతి ప్రవేశానికి ఈ నెల 17లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే 2, 4, 6, 8 తరగతుల్లో ప్రవేశం కోసం ఆఫ్‌లైన్ విధానంలో ఈ నెల 12లోపు దర ఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కేంద్రీయ విద్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

తనిఖీల పేరిట వసూళ్లు!

- ఉమ్మడి 'అనంత' జిల్లాలో బార్ల నుంచి భారీగా వసూళ్ల పర్వం
- తనిఖీలకు వెళ్లినా ఒక్క చలానా కూడా రాయలేదు
- ఒక అధికారి, ఇద్దరు కానిస్టేబుళ్లు జట్టుగా సోదాలు
- ఎస్ఐలు, సీఐలు ఎవరికీ సమాచారమే లేదు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఎక్సైజ్ అధికారులు తనిఖీల పేరుతో భారీగా డబ్బు వసూలు చేస్తున్న వ్యవహారం బయటపడింది. గత నాలుగు రోజులుగా కదిరి, ధర్మవరం, హిందూపురం, అనంతపురం, రాయదుర్గం తదితర చోట్ల బార్లకు వెళ్లి పెద్ద మొత్తంలో వసూలు చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన ఒక ఎక్సైజ్ (విజిలెన్స్) అధికారి ఇద్దరు కానిస్టేబుళ్లతో ఈ వ్యవహారం నడిపినట్టు తేలింది. బార్ల యాజమాన్యాలు దీనిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. సాధారణంగా నిబంధనలకు విరుద్ధంగా బార్లు నిర్వహిస్తే తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధించాలి. కానీ ఏ ఒక్క బార్‌కూ ఒక్క పైసా జరిమానా విధించలేదు. వరుసగా జరిమానాలు లేకుండా ఇలా దాడులు చేయడంతో పలువురికి అనుమానం వచ్చింది. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది.

ఆ ఇద్దరు కానిస్టేబుళ్లే

సాధారణంగా విజిలెన్స్ బృందాలు సమయాన్ని బట్టి ఏ సిబ్బంది అందుబాటులో ఉంటే వాళ్లతో తనిఖీలకు వెళతాయి. కానీ కదిరి, ధర్మవరం, హిందూపురం, రాయదుర్గంలో జరిగిన బార్ల తనిఖీల్లో అదే అధికారి, ఇద్దరు కానిస్టేబుళ్లే ఉన్నారు. ధర్మవరంలో బార్ యజమాని పేర్లు ఆరాతీయగా కానిస్టేబుళ్లు రామ్‌మోహన్, రమణమూర్తి అని తేలింది. ఒకరిద్దరు తమకు ఫైన్ వేసినట్టు రసీదులు ఇవ్వాలని అడిగితే కానిస్టేబుళ్లు ఇవ్వలేదు. నెలవారీ మామూళ్లు తీసుకుంటూ ఇలా ఎందుకు తనిఖీలు చేస్తున్నారంటూ ప్రశ్నించినా సమాధానం లేదు.

డ్రై డే రోజునా వసూళ్ల పర్వం

ఇటీవలే ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగాయి. ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగిన రోజుతో పాటు ఆ తర్వాత మూడు రోజుల పాటు మద్యం అమ్మకాలు నిషేధించారు. కానీ ఇదే బృందం తనిఖీల పేరుతో మద్యం అమ్మకాలు చేస్తున్న ప్రైవేటు వ్యక్తుల నుంచి భారీగా వసూలు చేసినట్టు తేలిసింది. ఒక్క కేసు కూడా నమోదు చేయకుండా వసూళ్లే టార్గెట్‌గా పనిచేశారు. విచిత్రమేమంటే ఉన్నతాధికారి, ఇద్దరు కానిస్టేబుళ్లకు మినహా డిపార్ట్‌మెంట్‌లో ఎస్ఐలు, సీఐలు ఎవరికీ ఈ తనిఖీల గురించి సమాచారం లేదు.

అదంతా దుష్ప్రచారం

మేమంటే గిట్టని వాళ్లు దుష్ప్రచారం చేస్తున్నారు. మేము ఎక్కడా వసూళ్లకు పాల్పడలేదు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లూ చేయలేదు. కావాలనే కొంతమంది ప్రచారం చేస్తున్నట్లు తెలుస్తోంది.

–శివప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్, ఎక్సైజ్ విభాగం

గరుడవాహనంపై రంగనాథస్వామి



తాడిపత్రి: ఆలూరు కోన రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో మంగళవారం రాత్రి గరుడవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయమే స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి గరుడవాహనంపై స్వామిని పురవీధుల్లో ఊరేగించారు.

88 మంది 'ఉపాధి' ఉద్యోగుల బదిలీ

అనంతపురం టౌన్: ఉపాధి హామీ పథకంలో 88 మంది ఉద్యోగులను ఇతర జిల్లాలకు బదిలీ చేస్తూ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఉత్తర్వులను జారీ చేసినట్లు జిల్లా నీటియాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. 14 మంది ఏపీఓలు (అడిషనల్ ప్రోగ్రామ్ అధికారులు), 40 మంది కంప్యూటర్ ఆపరేటర్లు, 34మంది టెక్నికల్ అసిస్టెంట్లను రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు బదిలీ చేసినట్లు వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం పలువురు సిబ్బందికి బదిలీ ఉత్తర్వులను అందజేసినట్లు తెలిపారు.

అడిగిన ప్రతి ఒక్కరికీ 'ఉపాధి'

ఆత్మకూరు: అడిగిన ప్రతి కూలీకి ఉపాధి హామీ కింద పని కల్పించాలని కలెక్టర్ నాగలక్ష్మి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం పంపనూరు వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కూలీలతో మాట్లాడారు. పనులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కూలి చెల్లింపులు కూడా సకాలంలో జరుగుతున్నాయన్నారు. వేసవిలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తగా పనులు చేసుకోవాలన్నారు.

'స్పందన'పై నిర్లక్ష్యం వద్దు

వివిధ సమస్యలపై ప్రజలు 'స్పందన'లో ఇచ్చే అర్జీల పరిష్కారంపై ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయరాదని కలెక్టర్ సచివాలయ ఉద్యోగులకు సూచించారు. పంపనూరు సచివాలయాన్ని సందర్శించిన కలెక్టర్.. పలు రికార్డులు పరిశీలించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సచివాలయ సిబ్బంది పర్యటించి ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ్‌ప్రసాద్, ఈఓఆర్‌డీ సత్యబాబు, ఏపీడీ అనురాధ, ఏపీఓలు సుజాత, పుష్ప, సర్పంచ్ ఎర్రిస్వామి, మాజీ సర్పంచ్ వన్నూరప్ప, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ సెక్రటరీలు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

సమయపాలన పాటించాలి

అనంతపురం రూరల్: సచివాలయ ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ నాగలక్ష్మి హెచ్చరించారు. మంగళవారం ఎ.నారాయణపురం సచివాలయం–3ను కలెక్టర్ తనిఖీ చేశారు. ఉద్యోగులు సమయపాలన పాటించాలన్నారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం బయోమెట్రిక్ హాజరు తప్పక నమోదు చేయాలన్నారు. తల్లిదండ్రులు లేని పిల్లలకు మిషన్ వాత్సల్య పథకం ద్వారా ప్రభుత్వం ప్రతి నెలా అందించే రూ. 4వేల ఆర్థిక సహాయాన్ని సక్రమంగా అందేలా మహిళా పోలీసులు అన్ని చర్యలూ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ మధుసూదన్, హౌసింగ్ పీడీ కేశవనాయుడు, తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి పాల్గొన్నారు.

నేడు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు

అనంతపురం రూరల్: అణగారిన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపిన మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు బుధవారం నగరంలో నిర్వహించనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విశ్వమోహన్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సప్తగిరి సర్కిల్‌లోని జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు ప్రజా ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో...

అనంతపురం క్రైం: స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి బుధవారం ఉదయం 9 గంటలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జరగనుంది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య తదితరులు హాజరుకానున్నారు.

జ్ఞానభూమి పోర్టల్‌లో ఫలితాలు



అనంతపురం సిటీ: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ) పరిధిలో నిర్వహించిన యూజీ ఐదో సెమిస్టర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు జ్ఞానభూమి పోర్టల్‌లో ఉన్నాయని డైరెక్టర్ ఆచార్య జీవీ రమణ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫలితాల కోసం అభ్యర్థులు పోర్టల్‌ను సందర్శిచాలని సూచించారు.

జనం లేక వెలవెల

- అనంతలో నారా లోకేష్ పాదయాత్ర అట్టర్‌ఫ్లాప్

అనంతపురం: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు అనంతపురం నగరంలో స్పందన కరువైంది. స్థానిక పంగల్ రోడ్డు నుంచి మంగళవారం ఉదయం పది గంటలకు పాదయాత్ర ప్రారంభించారు. ఆర్డీటీ స్టేడియం వద్దకు వచ్చేసరికి కాన్వాయ్, వ్యక్తిగత సిబ్బంది మినహా ఎవరూ లేరు. పండమేరు బ్రిడ్జి మీద డ్రోన్ కెమెరాలతో ఫొటోలు, వీడియోలు తీయించాలని ముందే ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. అయితే జనాలు రాకపోయేసరికి ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. టీవీ టవర్ వద్ద మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి ఆధ్వర్యంలో గజమాలతో లోకేష్‌ను సత్కరించారు. అక్కడా జనసమీకరణ చేయాలని చూసినా ఆశాభంగమే ఎదురైంది. కలెక్టరేట్ వద్ద జరిగిన బహిరంగ సభకు కూడా జనాలు రాకపోవడంతో వెలవెలబోయింది. పాదయాత్ర, బహిరంగ సభ అట్టర్‌ఫ్లాప్ కావడం నగరంలో ఆ పార్టీ దుస్థితికి అద్దం పడుతోందని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానించారు.



జనం లేక వెలవెలబోతున్న నారా లోకేష్ బహిరంగ సభ

జనానికి 'దూరం'గా యాత్ర

ఏ నాయకుడు అయినా జనం సమస్యలు తెలుసుకుని.. వారికి దన్నుగా నిలవడానికి పాదయాత్ర చేపడతారు. కానీ నారా లోకేష్ ఆసాంతం భద్రతా వలయంలోనే పాదయాత్ర కొనసాగిస్తున్నారు. ఎవరైనా పలకరించినా.. ఆగకుండా వెళ్లిపోతుండడం తమ్ముళ్లనే విస్మయానికి గురి చేస్తోంది.

10 వరకు రబీ పంటల ఈ–కేవైసీ గడువు



అనంతపురం అగ్రికల్చర్: ప్రస్తుత రబీ ఈ–క్రాప్ నమోదుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రైతులు ఈ–కేవైసీ చేయించుకోవడానికి ఈ నెల 10 వరకు గడువు విధించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) బి.చంద్రానాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రబీలో జిల్లా వ్యాప్తంగా 73,595 మంది రైతులు 2,79,719 ఎకరాల్లో పంటలు సాగు చేసినట్లు ఈ–క్రాప్ చేయించుకున్నారని పేర్కొన్నారు. అందులో 70,826 మంది రైతులు 2,69,347 ఎకరాల్లో పంట వేసినట్లు ఈ–కేవైసీ కూడా చేయించుకున్నారన్నారు. ఈ–క్రాప్ చేయించుకున్న ఇంకా 2,769 మంది రైతులు ఈ–కేవైసీ చేయించుకోలేదని తెలిపారు. ఏఓలు, ఆర్బీకే సిబ్బంది పెండింగ్ రైతులకు సమాచారం ఇచ్చి ఈ–కేవైసీ చేయించుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే వేసవిలో సాగైన పంటల నమోదుకు త్వరలోనే ఈ–క్రాప్ బుకింగ్ మొదలు పెట్టనున్నట్లు తెలిపారు.

ఆనందమని 'పింఛన్'

అనంతపురం : వైఎస్సార్ పింఛన్ కానుక పథకం కింద జిల్లాలో పింఛన్ల పంపిణీ వేగంగా కొనసాగుతోంది. మూడో తేదీ సాయంత్రం నుంచి పంపిణీ మొదలు కాగా..మంగళవారం రాత్రి తొమ్మిదిన్నర గంటల సమయానికి 84.37 శాతం పంపిణీ పూర్తయ్యింది. జిల్లాలో 2,75,602 మంది పింఛన్‌దారులు ఉండగా.. ప్రభుత్వం రూ.76.98 కోట్ల నగదు కేటాయించింది. ఇప్పటివరకు 2,32,527 మందికి రూ.64.89 కోట్లు పంపిణీ చేశారు.

అనంతపురంలో సుహాసినికి వృద్ధాప్య పింఛన్ అందిస్తున్న వార్డు వలంటీర్ శీనా



క్లుప్తంగా

విద్యుదాఘాతంతో మహిళ మృతి


మృతురాలు షంషాద్

గుత్తి: విద్యుత్ షాక్‌కు గురై ఓ మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తిలోని ఈద్గా మైదానంలో నివాసముంటున్న షంషాద్ (58) భర్త పదేళ్ల క్రితం మృతి చెందాడు. ఏడాది క్రితం కుమారుడు కూడా అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి తన ఇద్దరు కుమార్తెలతో కలసి జీవిస్తున్న ఆమె... కర్నూలు రోడ్డులో వడలు వేస్తూ జీవనం సాగిస్తోంది. మంగళవారం ఉదయం వడల పిండిని రుబ్బుకునేందుకు సిద్ధమైన ఆమె స్విచ్‌బోర్డులోని సాకెట్‌లో మిక్సీ ప్లగ్ పెడుతుండగా షాక్‌కు గురై కుప్పకూలింది. విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే చుట్టుపక్కల వారి సాయంతో ఆమెను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. తల్లి మృతితో ఇద్దరు ఆడపిల్లలు అనాథలయ్యారు. ఘటనపై గుత్తి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వివాహిత అదృశ్యం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని తిరుమల నగర్‌కు చెందిన వివాహిత అశ్విని మంగళవారం నుంచి కనిపించడం లేదు. ఈ మేరకు ఆమె భర్త శ్రీనివాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏ కారణం చేత ఆమె ఇల్లు వదిలి వెళ్లిందనేది తేలాల్సి ఉంది. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీగా రాహుల్‌దేవ్ సింగ్



అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీగా శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. అనంత ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప నెల రోజుల పాటు జరిగే 3వ దశ 21వ మిడ్–కెరీర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌కు హాజరు కానున్న నేపథ్యంలో ఈ మార్పు అనివార్యమైంది. అనంతపురం రేంజ్ పరిధిలో పనిచేస్తున్న 2002 నుంచి 2016 బ్యాచ్‌లకు చెందిన ఆఫీసర్లకు ఎస్‌వీపీ, ఎన్‌పీఏ అంశాలపై ఈ నెల 10వ తేదీ నుంచి మే 4వ తేదీ వరకూ శిక్షణ ఇవ్వనున్నారు. దీంతో శిక్షణకు హాజరయ్యేందుకు మంగళవారం విధుల నుంచి ఎస్పీ ఫక్కీరప్ప రిలీవ్ అయ్యారు.

అభాగ్యులకు వాత్సల్యం

- చిన్నారులకు నెలకు రూ.4 వేల ఆర్థిక సాయం
- ఈ నెల 15వ తేదీ లోపు దరఖాస్తుల స్వీకరణ


చిన్మయనగర్‌లో సర్వే చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

రాప్తాడు: విధి చిన్న చూపు చూసి తల్లిదండ్రులను కోల్పోయి, ఎలాంటి ఆదరణ లేని అభాగ్యులకు సర్కార్ అండగా నిలిచింది. అభాగ్యుల విద్య, వైద్య అవసరాలు తీర్చేందుకు మిషన్ వాత్సల్య పథకం అమలుకు శ్రీకారం చుట్టింది. మహిళాశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తుండగా... నిరాదరణ, పేదరికం కారణంగా ఏ ఒక్క చిన్నారీ చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 60:40 నిష్పత్తిలో నిధులు విడుదల చేస్తున్నాయి. ఒక్కొక్కరికి కేంద్ర ప్రభుత్వం నెలకు రూ.2,400 అందజేస్తే, రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.1600 ఇస్తోంది. నిరుపేద, నిస్సహాయ స్థితిలో కుటుంబల సంరక్షణ, ఆదరణ అవసరమైన పిల్లలు, వారి తల్లిదండ్రుల రక్త సంబంధీకులు సంరక్షకులతో నివసిస్తూ విద్యను కొనసాగించేందుకు ఈ స్పాన్సర్‌షిప్ దోహదపడుతుంది.

అర్హులు వీరే...

వీటి పరిధిలో తల్లిదండ్రులు లేని అనాథలు, ప్రాణాంతక వ్యాధితో బాధపడే తల్లిదండ్రులున్న పిల్లలు, తల్లి లేదా తండ్రినీ కోల్పోయిన పాక్షిక అనాథలు, విడాకులు తీసుకున్న తల్లిదండ్రులున్నవారు, ప్రకృతి వైపరీత్యానికి గురైన, యాచకులైన, బాల కార్మికులు, బాల్య వివాహం జరిగిన వారు.. తదితర బాధిత పిల్లలు, దివ్యాంగులకు మిషన్ వాత్సల్య పథకం కింద రూ.4 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేస్తారు.

అవసరాన్ని బట్టి స్పాన్సర్‌షిప్ పొడిగింపు

మిషన్ వాత్సల్య పథకానికి సంబంధించి అర్హుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. ఈ నెల 15వ తేదీని తుది గడువుగా నిర్దేశించారు. అనంతపురం జిల్లా వ్యాప్తంగా 2,302 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల పరిధిలో దరఖాస్తులను స్వీకరించి, అర్హులను గుర్తించే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ సంవత్సర ఆదాయం రూ.72 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.96 వేలకు మించని వారు అర్హులు. జువైనల్ జస్టిస్ (జేజే) బోర్డు, బాలల సంక్షేమ కమిటీ కోర్టు లిఖిత పూర్వకంగా నమోదు చేసిన కారణాల ఆధారంగా అవసరాన్ని బట్టి స్పాన్సర్ షిప్ పొడిగించే అవకాశమూ ఉంది. స్పాన్సర్ షిప్ అందుకుంటున్న బాలలను ఏదైనా వసతి గృహం, బాల సదనంలో చేర్పించిన తర్వాత సాయం నిలిపివేస్తారు. ప్రత్యేక అవసరాలు కలిగిన బాలలను మినహాయించి మిగిలిన బాలలు పాఠశాలలకు 30 రోజులకు పైగా సక్రమంగా వెళ్లడం లేదని తేలితే వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆర్థిక సాయాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తారు.

దరఖాస్తుకు జత చేయాల్సిన పత్రాలివే..

- బాలుడు/బాలిక జనన ధ్రువీకరణ పత్రం
- ఆధార్ కార్డు
- తల్లి, తండ్రి ఆధార్ కార్డులు
- తల్లి/తండ్రి మరణ ధ్రువీకరణ పత్రం
- గార్డియన్ ఆధార్, బియ్యం కార్డు
- కుల ధ్రువీకరణ పత్రం
- బాలుడు/బాలిక పాస్‌పోర్టు సైజు ఫొటో
- స్టడీ సర్టిఫికెట్
- ఆదాయ ధ్రువీకరణ పత్రం
- బాలుడు/బాలిక వ్యక్తిగత బ్యాంక్ ఖాతా లేదా తల్లి/తండ్రి/సంరక్షకులతో కలిసిన జాయింట్ అకౌంట్ వివరాలు

అవగాహన కల్పించాం

మిషన్ వాత్సల్య పథకానికి సంబంధించి ఇప్పటికే సచివాలయాల పరిధిలో వలంటీర్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాం. అర్హులైన ప్రతి ఒక్కరూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకున్నాం.
– ఝాన్సీరాణి, ఐసీడీఎస్ సూపర్ వైజర్–2, రాప్తాడు

ఉన్నతాధికారుల ఆదేశం

మిషన్ వాత్సల్య పథకానికి సంబంధించి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఇప్పటికే ఈ ప్రక్రియను చేపట్టాం. అంగన్‌వాడీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అర్హులను గుర్తించి స్వీకరించిన దరఖాస్తులను ప్రాజెక్ట్ అధికారులకు అందజేశాం.
– నాగరత్న, ఐసీడీఎస్ సూపర్ వైజర్–1, రాప్తాడు

సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ ఆదేశాల మేరకు మిషన్ వాత్సల్య పథకానికి సంబంధించి ఈ ఏడాది స్పాన్సర్ షిప్ మంజూరు చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఈ నెల 15వ తేదీలోపు దరఖాస్తులు అందజేయాలి.
– బీఎన్ శ్రీదేవి, ఐసీడీఎస్ పీడీ

పరీక్ష కేంద్రాల్లో ప్రైవేట్ వ్యక్తులు కనిపించకూడదు



రాప్తాడురూరల్: పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో ప్రైవేట్ వ్యక్తులు కనిపించకూడదని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పరీక్షల నిర్వహణ విధుల్లో ఉన్న వారందరూ అత్యంత జాగ్రత్తగా ఉండాలి. ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా ఇబ్బందులు పడతారు. పరీక్ష కేంద్రాల్లో ఏవైనా అవకతవకలు జరిగినా చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, సీ–సెంటర్ కస్టోడియన్లదే బాధ్యత. యాక్ట్–25 మేరకు చర్యలు ఉంటాయి.

- పరీక్ష కేంద్రాలన్నీ నో మొబైల్ జోన్లుగా ప్రకటించాం. మొబైల్ ఫోన్లు ఇంటివద్దే పెట్టిరావాలి. లేదంటే సెంటర్‌లో పోలీస్ పికెటింగ్ వద్ద మొబైల్ అప్పగించాలి.
- ఒకసారి పరీక్ష కేంద్రంలోకి వచ్చిన సిబ్బంది పరీక్ష ముగిసేదాకా ఎలాంటి పరిస్థితుల్లోనూ బయటకు రాకూడదు. అటెండర్లు, ఇతర సహాయకులు కూడా టీ, చల్లని పానీయాల అవసరాల కోసం పరీక్షల సమయంలో బయటకు రాకూడదు.
- పరీక్ష విధులు లేని ఉపాధ్యాయులు పరీక్ష జరిగే సమయంలో పరీక్ష కేంద్రాల పరిసరాల్లో ఉండకూడదు. పరీక్ష కేంద్రాలుగా ఉన్న కేజీబీవీలు, రెసిడెన్షియల్ పాఠశాలలకు చెందిన పరీక్ష విధుల్లో లేని ఉపాధ్యాయులు పరీక్ష జరిగే సమయంలో పాఠశాలల్లో ఉండకూడదు.
- ప్రశ్నపత్రాలు, వాటిపై వదంతులు వాట్సాప్ గ్రూపులు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయకూడదు.
- పరీక్షకు గైర్హాజరయ్యే విద్యార్థుల ప్రశ్నపత్రాలు, మిగిలిన ప్రశ్నపత్రాలు ఉదయం 10 గంటలలోపు ప్రశ్నపత్రాల అకౌంట్ రాసి జాగ్రత్తగా సీల్ చేసి ఉంచాలి. ఈ నిబంధనలు అతిక్రమించిన వారిపై పరీక్ష చట్టం 25/97 ప్రకారం ఏడేళ్ల జైలు శిక్ష, లక్ష రూపాయల వరకు జరిమానాకు శిక్షార్హులని డీఈఓ గుర్తు చేశారు.

ఆలయంలో నంది విగ్రహం చోరీ


విగ్రహం పెకలించడంతో ఖాళీగా ఉన్న దిమ్మె

హిందూపురం: పట్టణంలోని రైల్వేబ్రిడ్జి వద్ద ఉన్న పురాతన అనంత పద్మనాభ స్వామి ఆలయంలోని నంది విగ్రహాన్ని ఎత్తుకెళ్లిన సంఘటన మంగళవారం కలకలం రేపింది. ఆలయ ఈఓ నాగేంద్రుడు తెలిపిన మేరకు.. సోమవారం అర్ధరాత్రి ముగ్గురు దుండగులు రైల్వేస్టేషన్ రోడ్డు వైపు నుంచి ఆలయ ప్రహరీ గోడకు నిచ్చెన వేసి లోపలికి ప్రవేశించారు. నంది విగ్రహం ఎత్తుకెళ్లారు. ముగ్గురు వ్యక్తులు వెనుకవైపు వెళ్లడం కల్యాణ మండపం వాచ్‌మెన్ చూసినట్లు ఈఓ చెప్పారు. ఆలయంలో ఉన్న సీసీ కెమెరా నాలుగురోజుల నుంచి పనిచేయడం లేదని ఆయన తెలిపారు. ఈ మేరకు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదులో చేశారు. సీఐ వెంకటేశ్వర్లు క్లూస్ టీం ద్వారా ఆలయంలో పరిశీలించారు. కాగా, పురాతన ఆలయాల్లో విగ్రహాల కింద వజ్రాలు, బంగారు నాణేలు, ఇతర విలువైన వస్తువులు ఉంచుతారని చెబుతారు. దీంతో విగ్రహాన్ని తవ్వి ఎత్తుకెళ్లి ఉంటారని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

రెండో విడత యంత్రసేవపై దృష్టి పెట్టండి

- రాయితీ రుణాల కోసం దరఖాస్తుకు ఈ నెల 18 తుది గడువు
- వీడియోకాన్ఫరెన్స్‌లో వ్యవసాయశాఖ కమిషనర్ హరికిరణ్

అనంతపురం అగ్రికల్చర్: వైఎస్సార్ యంత్రసేవ పథకం కింద రెండో విడతగా కమ్యూనిటీ హైయరింగ్ సెంటర్లు (సీహెచ్‌సీ) ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ కమిషనర్ సి.హరికిరణ్ ఆదేశించారు. మంగళవారం విజయవాడ నుంచి జిల్లా అధికారులతో ఆయన వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లాలో 451 ఆర్‌బీకేలు ఉండగా వాటికి అనుబంధంగా రాయితీతో ట్రాక్టర్లు, ఇతర ఆధునిక సేద్యపు పరికరాలు రైతుమిత్ర గ్రూపులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో ఇప్పటికే మొదటి విడత కింద గతేడాది జూన్‌లో 219 సీహెచ్‌సీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాజాగా రెండో విడతగా మిగతా 232 సీహెచ్‌సీలు సాధ్యమైనంత తొందరగా అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. రాయితీతో రుణాల పంపిణీకి సంబంధించి ఈ నెల 18వ తేదీలోపు దరఖాస్తులు స్వీకరించాలన్నారు. అలాగే వాటికి సంబంధించి పూర్తి స్థాయి ప్రతిపాదనలు ఈనెల 24 నాటికి ప్రభుత్వానికి సమర్పించాలన్నారు. నెలాఖరులోపు మెగామేళా ఏర్పాటు చేసి ట్రాక్టర్లు, యంత్రపరికరాలు రైతులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అందుకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లు చేయాలని డీఏఓ బి.చంద్రానాయక్‌ను ఆదేశించారు.

చేదెక్కిన చెరకు!

- ఏడాదికేడాదికీ తగ్గుతున్న సాగు విస్తీర్ణం
- శ్రీసత్యసాయి జిల్లాలో కేవలం 17 ఎకరాల్లో పంట
- పెట్టుబడి అధికం కావడంతో అన్నదాతల విముఖత
- మార్కెట్ సౌకర్యం లేక నైరాశ్యం



క్రషర్ కోసం చెరుకును సిద్ధం చేస్తున్న కూలీలు, బెల్లం తయారుచేస్తున్న రైతులు

పుట్టపర్తి అర్బన్: శ్రీసత్యసాయి జిల్లాలో చెరకు సాగు తగ్గిపోతోంది. గతంలో సుమారు 2 వేల ఎకరాల్లో సాగయ్యే పంట నేడు 17 ఎకరాలకు పరిమితమైంది. చిలమత్తూరు మండలంలో 10 ఎకరాలు, నల్లమాడ మండలంలో 5, పుట్టపర్తి మండలంలో కేవలం 2 ఎకరాల్లో ప్రస్తుతం చెరకు సాగులో ఉంది.

మార్కెట్ సౌకర్యం లేక ఇబ్బందులు..

అడవి పందుల దాడులను తట్టుకొని గ్రామీణ ప్రాంత రైతులు చెరకు సాగు చేస్తున్నా బెల్లంకు గిట్టుబాటు ధర ఉండక పోవడం శరాఘాతంగా మారుతోంది. స్థానికంగా కొంతమంది రైతులు క్రషర్ల ద్వారా చెరకు నుంచి వచ్చిన పాలతో బెల్లం తయారు చేస్తున్నారు. మార్కెట్ సౌకర్యం లేక వ్యాపారులకు తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. పెట్టుబడి ఖర్చు కూడా రావడం లేదని వాపోతున్నారు. జిల్లాలో హిందూపురంలో తప్ప ఎక్కడా మార్కెట్లు లేవు. ఇక్కడికి అధికంగా కర్ణాటక నుంచి బెల్లం వస్తుంది. ఆ బెల్లం నాణ్యంగా ఉండడం, వ్యాపారులు దాన్నే కొనుగోలు చేస్తుండడంతో జిల్లా రైతులు తక్కువ ధరకే కట్టబెట్టాల్సి వస్తోంది.

రైతుల శ్రమ వ్యాపారుల పాలు..

చెరకు పంట సాగు చేసినప్పటి నుంచి నీటి పారకం ఒక ఎత్తు అయితే గుమ్ములు కట్టడం, కలుపు తీయడం మరో ఎత్తు. పందుల గుంపు వస్తే తోటలో విధ్వంసాన్ని సృష్టిస్తాయి. ఒక్కసారి చెరకు తోటలోకి అడవి పందులు వస్తే వాటిని తరిమి వేయడం మరింత కష్టం. మామూలుగా చెరకు నుంచి పాలు తీసే క్రషర్‌కు రోజుకు రూ.500 బాడుగ, మిషన్ సొంతంగా కొనుగోలు చేయాలంటే సుమారు రూ.లక్ష వరకూ ఖర్చవుతుంది. బెల్లం తయారు చేసే నిష్ణాతుడైన కూలీకి రోజుకు రూ.500 ఇవ్వాలి. చెరకు కొట్టే కూలీలకు రోజుకు రూ.300, బెల్లం తయారీకి వేయడానికి సోడాపొడి, హైడ్రోస్ మందులకు ఖర్చులు పోనూ రైతులకు మిగిలేది అతి తక్కువ. దీంతో చెరకు సాగు చేయడానికి చాలా మంది వెనకడుగు వేస్తున్నారు. క్రషర్ ఆడడానికి విద్యుత్ సమస్య ఉండడంతో డీజిల్ ఇంజిన్‌లతో చెరకు ఆడిస్తున్నట్లు పుట్టపర్తి మండలం గంగిరెడ్డిపల్లి రైతులు శివకేశవులు, చిన్న ఆంజనేయులు చెప్పారు. మిషన్‌కు గంటకు 2 లీటర్ల డీజిల్ అవసరమవుతుందన్నారు. అన్ని అవరోధాలను తట్టుకుని నిష్ణాతులైన కూలీలతో కలిసి రాత్రింబవళ్లు కష్టపడి బెల్లం తయారు చేయించి అమ్మకం వరకూ శ్రమ కోర్చి పండిస్తే వ్యాపారులు శ్రమను దోచుకుంటున్నారని వాపోయారు.

మిషన్లు అమ్మి ముంచిన బాబు..

రెండు దశాబ్దాల క్రితం జిల్లాలో ఏ గ్రామంలో చూసినా చెరకు తోటలు కనిపించేవి. కోత అనంతరం పంటను హిందూపురం సమీపంలోని పరిగి మండల కేంద్రంలో ఉన్న హిందూపూర్ నిజాం షుగర్ ఫ్యాక్టరీకి రైతులను తరలించేవారు. 1972 నుంచి వేలాది మంది రైతులు దీనిపైనే ఆధారపడి జీవించేవారు. అయితే, 1998లో అప్పటి సీఎం చంద్రబాబు రూ.30 కోట్లు విలువ చేసే ఫ్యాక్టరీ మిషన్లను కేవలం రూ. 3 కోట్లకు తెలంగాణలోని రేణుక షుగర్ ఫ్యాక్టరీకి విక్రయించారు. షుగర్ ఫ్యాక్టరీ కోసం సుమారు 168 ఎకరాల భూమిని ఇచ్చిన రైతులు ఆనాడు చాలా కాలం ధర్నాలు, ఆందోళనలు, నిరాహార దీక్షలు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఈ క్రమంలోనే సదరు భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకున్నారు. ఫ్యాక్టరీ మూతపడడంతో కోట్లాది రూపాయల భూములు కోల్పోవడమే గాక దాన్నే నమ్ముకొని చెరకు సాగు చేసే రైతులు తీవ్రంగా నష్ట పోవాల్సి వచ్చింది.

దొంగకు దేహశుద్ధి

గుత్తి: నగదు అపహరించడానికి ప్రయత్నించిన ఓ దొంగను పట్టుకుని దేహశుద్ధి చేసిన ఘటన గుత్తి పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో మంగళవారం జరిగింది. గుత్తికి చెందిన షేక్ బాషా మంగళవారం స్థానికంగా ఉండే ఓ బ్యాంకులో రూ. 3.50 లక్షలు డ్రా చేసుకుని బైక్‌లో పెట్టుకుని ఇంటికి బయలుదేరాడు. తాడిపత్రి రోడ్డులో స్నేహితుని షాపు వద్ద బైకు ఉంచి లోపలికి వెళ్లాడు. ఈ క్రమంలోనే ఓ గుర్తు తెలియని యువకుడు బైక్‌లో ఉంచిన నగదు చోరీ చేయడానికి ప్రయత్నించాడు. గుర్తించిన షేక్ బాషా కేకలు వేయడంతో స్థానికులు యువకున్ని పట్టుకున్నారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఆటోను ఢీకొన్న టిప్పరు పది మందికి గాయాలు

శింగనమల: ఆటోను టిప్పర్ ఢీకొన్న ఘటనలో పది మంది వ్యవసాయ కూలీలు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... నార్పల మండలం నడిమిదొడ్డి గ్రామానికి చెందిన పది మంది కూలీలు మంగళవారం ఉదయం శింగనమల మండలం ఉల్లికల్లుకు కరివేపాకు తొలగింపు పనులకు హాజరయ్యారు. పని ముగించుకుని ఆటోలో తిరుగు ప్రయాణమైన వీరు కొరివిపల్లి వద్దకు చేరుకోగానే వేగంగా దూసుకొచ్చిన టిప్పర్ ఢీకొంది. ఆటోలో ప్రయాణిస్తున్న రాము, వెంకటకృష్ణ, లక్ష్మీదేవి, రాజు, లక్ష్మీనారాయణమ్మ, రాకేష్, అశోక్, పెద్దక్క, సరస్వతి, మరొకరు గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

స్కూల్ అసిస్టెంట్లు దరఖాస్తు చేసుకోండి

రాప్తాడు రూరల్: స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌సీఈఆర్టీ) విభాగంలో డిప్యూటేషన్‌పై పనిచేయడానికి ఆసక్తి ఉన్న స్కూల్ అసిస్టెంట్ల (ఎస్‌ఏ) నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.సాయిరాం మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అసెస్మెంట్ ఎక్స్‌పర్ట్ ఇంగ్లిష్, సోషల్ స్టడీస్, మ్యాథమెటిక్స్ పోస్టులకు సంబంధించి ఆయా పాఠ్యాంశాల టీచర్లు (ఎస్‌ఏ) అర్హులు. అలాగే అసెస్మెంట్ ఎక్స్‌పర్ట్ ఈవీఎస్ సైన్స్ పోస్టుకు స్కూల్ అసిస్టెంట్ బీఎస్/పీఎస్ టీచర్లు అర్హులు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఈ నెల 6వ తేదీ సాయంత్రంలోపు దరఖాస్తులను scert.cse@apschooledu.in కు మెయిల్ చేయాలి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పావగడ: వైఎన్ హొసకోట పోలీసుస్టేషన్ పరిధిలోని యల్లప్ప నాయకన హళ్లికి చెందిన కృష్ణమూర్తి (35) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మృతుడు కృష్ణమూర్తి సిలిండర్‌ను టీవీఎస్ 50 వాహనంలో పెట్టుకుని వైఎన్ హొసకోట నుంచి సొంత ఊరు వైఎన్ హళ్లికి వెళ్తుండగా మార్గ మధ్యలో అదుపు తప్పి కిందకు పడి తీవ్ర గాయాలయ్యాయి. గుర్తించిన స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ద్విచక్ర వాహనం వెనుక సీట్లో కూర్చున్న మృతుడి కుమారుడు క్షేమంగా బయట పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం

గాండ్లపెంట: మండల పరిధిలోని తూపల్లికి చెందిన పోరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి (60) సోమవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. హెడ్ కానిస్టేబుల్ తిరుమలరెడ్డి తెలిపిన మేరకు.. మృతుడు కొన్ని సంవత్సరాలుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. సోమవారం రాత్రి నొప్పి తీవ్రం కావడంతో ఇంట్లో ఉన్న పురుగుల మందుతాగి అపస్మారక స్థితికి చేరాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే కదిరి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుని కుమారుడు పోరెడ్డి రమేష్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

విద్యార్థి ఆత్మహత్య


సందీప్ (ఫైల్)

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతంలో బేతరాసి సందీప్ (19) అనే విద్యార్థి మంగళవారం విషపు గుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. బుక్కపట్నం మండలం గూనిపల్లికి చెందిన అక్కులప్ప కుమారుడు సందీప్ పులివెందుల లయోలా కాలేజీలో సెకండియర్ బీకాం కంప్యూటర్స్ చదువుతున్నాడు. చదువుపై ఇష్టం లేక తరచూ గ్రామానికి వచ్చేవాడు. రెండు రోజుల క్రితం కూడా ఇలాగే ఇంటికి వచ్చిన సందీప్ మంగళవారం కళాశాల వెళ్తున్నానని చెప్పి ముదిగుబ్బ వచ్చాడు. ఏం జరిగిందో తెలియదు కాని రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతంలో విషపు గుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఒక్కగానొక్క కుమారుడి మృతితో అక్కులప్ప గుండెలవిసేలా విలపించాడు.

అక్రమంగా మైన్స్ తరలింపు.. లారీ సీజ్

తలుపుల: అక్రమంగా మైన్స్ తరలిస్తున్న ఓ లారీని అధికారులు సీజ్ చేశారు. మండలంలో బి.కొత్తపల్లి సమీపంలోని చెక్ పోస్టులో సోమవారం రాత్రి తనిఖీలు చేస్తుండగా, ఉడమలకుర్తి క్వారీ నుంచి పులివెందుల వైపు మైన్స్ తరలిస్తున్న లారీ వచ్చింది. సిబ్బంది పరిశీలించగా, ఎలాంటి బిల్లులు లేవు. దీంతో లారీని స్వాధీనం చేసుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీజ్ చేశారు.

క్లుప్తంగా

సిజేరియన్ ప్రసవాలను అరికట్టాలి

• డీఎంహెచ్ఓ వీరబ్బాయి


రికార్డులను పరిశీలిస్తున్న వైద్యాధికారులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: సిజేరియన్ ప్రసవాలను అరికట్టాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వీరబ్బాయి ఆదేశించారు. మంగళవారం నగరంలోని మైత్రి ఆస్పత్రిని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ యుగంధర్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిజేరియన్ ప్రసవాలపై ఆరా తీశారు. సిజేరియన్ ప్రసవాలను పూర్తిగా తగ్గించాలని సూచించారు. ఇష్టారాజ్యంగా సిజేరియన్లు చేయడం ద్వారా ఇబ్బందులుంటాయన్నారు. సిజేరియన్ ప్రసవాలను పరిమితంగా చేసేందుకు ప్రత్యేక కమిటీ ద్వారా జిల్లా వ్యాప్తంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

8న రాతిదూలం లాగుడు పోటీలు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని ఏటిగడ్డ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి సహకారంతో ఈ నెల 8న ఉదయం 8 గంటలకు రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మొదటి బహుమతి రూ.30 వేలు, రెండో బహుమతి కింద రూ.20 వేలు, మూడో బహుమతి రూ.15 వేలు, 4వ బహుమతి రూ.10 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్: 79951 36069, 99894 34955లో సంప్రదించాలన్నారు.

చలివేంద్రం ప్రారంభం

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని రాంనగర్ సమీపంలో ఉన్న నీరు- ప్రగతి పార్క్ సమీపంలో డీఎస్ తైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని 4వ పట్టణ సీఐ జాకీర్ హుస్సేన్ మంగళవారం ప్రారంభించారు. డీఎస్ తైక్వాండో అకాడమీ కోచ్ శ్రీకాంత్‌రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

9న ఉమ్మడిశెట్టి అవార్డు ప్రదాన సభ

అనంతపురం కల్చరల్: నగరంలోని మూడోరోడ్డులోని జీఆర్ మినీ ఫంక్షన్‌హాలులో ఉమ్మడిశెట్టి సత్యాదేవి అవార్డు ప్రదాన సభ ఈనెల 9న జరుగుతుందని నిర్వాహకులు డాక్టర్ రాధేయ తెలిపారు. ఈ ఏడాది ప్రముఖ కవి వసీరాకు 'సత్యాదేవి సాహితీ అవార్డు -2022' అందిస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ కవి కొప్పర్తి రమణమూర్తి, ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి ఆత్మీయ అతిథులుగా పాల్గొంటారన్నారు. భారతీ కోడె, వాణి కోరటమద్ది, గీతా వెల్లంకి, జంగం స్వయం ప్రభ, రవీంద్ర సూరి తదితరులకు ఆత్మీయ పురస్కారాలు అందించనున్నారు. ఇదే సమావేశంలో డాక్టర్ రాధేయ రచించిన సాంత్వనమ్ పుస్తకావిష్కరణ కూడా ఉంటుందని తెలిపారు.

ఇన్విజిలేటర్ల సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోవాలి

రాప్తాడురూరల్: ఇన్విజిలేటర్ల సస్పెన్షన్ ఉపసంహరించుకోవాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు జి. సూర్యుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. రమణారెడ్డి, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యులు కృష్ణమూర్తి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రశ్న పత్రం ఇవ్వడంలో జరిగిన పొరపాటుకు ఇద్దరు టీచర్లను సస్పెండ్ చేశారని, ఓపెన్ స్కూల్ పరీక్షల్లో ఆరుగురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేశారన్నారు.

నేత్రపర్వంగా జైన్ శోభాయాత్ర


వెండిరథంపై ఊరేగుతున్న వర్ధమాన మహావీరుడు

అనంతపురం కల్చరల్: జైనుల ఆరాధ్యుడైన 24వ తీర్థంకరుడు వర్ధమాన మహావీర్ జయంతి మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. పాతూరులోని వాసుపూజ్యస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఉదయం పాతూరు నుంచి నగరవీధుల్లో వెండిరథంపై ఉత్సవమూర్తి శోభాయాత్ర జరిగింది. జైనులు వసంతాలు చల్లుకుంటూ ఆటపాటలతో సందడి చేశారు. మహావీర్ స్వామి జన్మ కల్యాణ్ పేరిట సాగిన సంప్రదాయ వేడుకల్లో భాగంగా సామూహిక భజనలు, తీర్థప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో జైన్ మందిరాల ప్రతినిధులు వసంత జైన్, రమేష్ రికప్‌చంద్, అమృతలాల్, జగ్‌రాజ్ జైన్, జయంతిలాల్, కాంతిలాల్ పాల్గొన్నారు. కమలానగర్‌లోని వాసుపూజ్యస్వామి ఆలయంలో వేడుకలు జరిగాయి.

గరుడవాహనంపై రంగనాథుడు

తాడిపత్రి: ఆలూరు కోన రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో మంగళవారం రాత్రి గరుడవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయమే స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి గరుడవాహనంపై స్వామిని పురవీధుల్లో ఊరేగించారు.

తమ్ముళ్ల కిక్కు


మద్యం బాటిళ్లను సంచిలో సర్దేస్తూ..


బిరబిరా మోసుకెళుతూ..

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మంగళవారం అనంతపురంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో పాల్గొనేందుకు జనం ఆసక్తి చూపలేదు. దీంతో ఆ పార్టీ నేతలు మద్యం, డబ్బులిచ్చి తరలించారు. అయినప్పటికీ పలుచగానే వచ్చారు. అయితే ..మద్యం షాపుల వద్ద మాత్రం 'తమ్ముళ్ల' సందడి కన్పించింది. మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి అక్కడే సేవించడంతో పాటు కార్లు, ఇతరత్రా వాహనాల్లో తీసుకెళ్లారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం


కారు డిక్కీలో పెడుతూ..

అన్ని వర్గాల సంక్షేమమే జగన్ ధ్యేయం

• ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి


సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం రూరల్: అన్ని వర్గాల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. మంగళవారం జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డితో కలసి అనంతపురం రూరల్ పంచాయతీ పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాల లబ్ధి, స్థానిక సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రాజకీయాలకతీతంగా వివక్ష లేకుండా సంక్షేమ పథకాలు అందుతున్నాయని, వలంటీర్లే ప్రతి ఇంటికీ వచ్చి సమస్యలు తెలుసుకొని, పరిష్కరిస్తున్నారన్నారు.

ప్రజల ముగింటకే పాలన ...

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అన్నారు. రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీసంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు అందాలంటే టీడీపీ నాయకులు, జన్మభూమి కమిటీ సభ్యుల దయ ఉంటేనే..అందేవన్నారు. తమ ప్రభుత్వంలో అలాంటి పరిస్థితి లేదన్నారు. అర్హతే ప్రామాణికమన్నారు. చంద్రబాబు పాలనకు తమ ప్రభుత్వ పాలనకు తేడా ఏమిటో ప్రజలే గమనించాలన్నారు. ప్రజల ముగింటకే పాలన తీసుకురావాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సైతం ఇతర రాష్ట్రాల్లో అమలు చేయడానికి అక్కడ ప్రభుత్వాలు ప్రయత్నించడం ఎంతో గర్వకారణమన్నారు. అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి గురించి పట్టించుకోని టీడీపీ నాయకులు.. తాము మళ్లీ అధికారంలోకొస్తే ప్రజలకు మేలు చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. లోకేష్ పాదయాత్ర చేసినా చంద్రబాబు, ఎల్లో మీడియా ప్రజలను మభ్య పెట్టాలని చూసినా 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటమి తప్పదన్నారు.

అన్ని విధాలా అభివృద్ధి చేశాం:

నగరానికి ధీటుగా నియోజకవర్గ పరిధిలోని నాలుగు పంచాయతీలను అన్ని విధాలా అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే అన్నారు. గత ప్రభుత్వంలో నియోజకవర్గ అభివృద్ధిని పూర్తిగా విస్మరించారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకొచ్చిన ఈ మూడున్నరేళ్ల కాలంలో దాదాపు రూ. 600 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. రాబోవు రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడుపుతామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉదయ్‌శంకర్, ఉప సర్పంచ్ సుమిత్ర, ఎంపీటీసీ ఆశాజ్యోతి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు జయరాంనాయుడు, జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, నాయకులు నగేష్, గౌస్‌బేగ్, శ్రీనివాసులు, కృష్ణవేణి, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి పరాకాష్ట

• కేజీబీవీలో తాగునీటికోసం అవస్థలు
• డబ్బు పెట్టి కొంటున్న వైనం


నిరుపయోగంగా ఉన్న ఆర్ఓ ప్లాంట్

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తోంది. నాడు- నేడు ద్వారా ప్రతి పాఠశాలలోనూ మౌలిక వసతులు కల్పించారు. తాగునీటి వసతి, మరుగుదొడ్లు నిర్మించారు. అయితే పాఠశాల బాధ్యులు, సిబ్బంది నిర్లక్ష్యంతో విద్యార్థినులకు అవస్థలు తప్పలేదు. ఆత్మకూరు కస్తూర్బా పాఠశాలలో నాడు-నేడు ద్వారా వచ్చిన ఆర్ఓ (శుద్ధ తాగు నీరు) ప్లాంట్ నాలుగు నెలలుగా నిరుపయోగంగా ఉంది. 2020లో నాడు - నేడు పథకం ద్వారా రూ.1.75 లక్షలు వెచ్చించి ఆర్ఓ ప్లాంట్‌ను కొనుగోలు చేశారు. ఈ ప్లాంట్‌ను ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రారంభించారు. 2015లో ఓ దాత మినీ వాటర్‌ప్లాంట్‌ను పాఠశాలకు అందించారు. కానీ ప్రస్తుతం పాఠశాలలో ఒక్కటీ పనిచేయలేదు. రోజుకు ఒక్క విద్యార్థికి సగటున 5 లీటర్ల నీరు అవసరం ఉంటుంది. పాఠశాలలోని 270 మంది విద్యార్థినులు నీటికోసం ఇబ్బందులు పడుతున్నారు. రోజుకు 30 నుంచి 35 వాటర్ క్యాన్లు (15 లీటర్లు) కొనుగోలు చేస్తున్నారు. దీంతో నెలకు రూ.9 నుంచి రూ.10 వేల వరకు వృథాగా ఖర్చవుతోంది. ఈ విషయం తెలసినా సంబంధిత అధికారులు మాత్రం తమకు పట్టీపట్టనున్నట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికితోడు పాఠశాలలోని ఉపాధ్యాయినులపై తీరుపైనా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార నిమిత్తం మాజీ మంత్రి పరిటాల సునీత పాఠశాలకు రాగా.. ఆ ముగ్గురు ఉపాధ్యాయినులు పార్టీ కార్యకర్తల్లా ఆమెకు ఘన స్వాగతం పలికారు. విద్యార్థినులతో కలిసి ఫొటోలు కూడా తీయించడంపై విమర్శలు వచ్చాయి.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి


సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు కిట్లు అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాప్తాడు: రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పార్టీ విజయానికి గ్రామ స్థాయి నుంచి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి అధ్యక్షతన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి 14 వరకు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు సమష్టిగా పని చేయాలన్నారు. అందరూ గ్రూపుగా ఇంటింటికీ వెళ్లి 'జగనన్నే మా భవిష్యత్తు' కిట్లు పంపిణీ చేయాలన్నారు. జగనన్న నువ్వే మా నమ్మకం స్టిక్కర్లను, సెల్‌ఫోన్లు, గోడలకు అతికించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నారాయణ స్వామి, నాయకులు మన్నల రవికుమార్, సాకే చంద్ర, పాలబావి లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, ఆది నారాయణ రెడ్డి, మాచినేని చెన్నారెడ్డి, రామలింగమయ్య, మహిళ నాయకురాలు ఉషా రాణి తదితరులు పాల్గొన్నారు.

చెత్త నిర్వహణపై చైతన్యం తీసుకురావాలి

అనంతపురం క్రైం: 'చెత్త రహిత నగరమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, చెత్త నిర్వహణపై ప్రజల్లో చైతన్యం తేవాలని సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, రీసోర్స్‌పర్సన్లను కమిషనర్ రమణారెడ్డి ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిబ్బందితో మాట్లాడారు. ముఖ్యంగా తడి, పొడి చెత్తను ప్రజలు వేరు చేసి, సుందర అనంతకు పాటుపడాలని కోరారు. ఇప్పటికే రెండు లక్షలకుపైగా మూడు రకాల డస్ట్‌బిన్లు అందించినట్లు తెలిపారు. కేంద్రం, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశానుసారంగా చెత్త సేకరణకు తీసుకునే యూజర్ చార్జీలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా చార్జీలను చెల్లించేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. రీసర్వేలో భాగంగా ప్రతి సర్వే నంబర్‌కు వివిధ అసెస్‌మెంట్లకు మ్యాపింగ్ చేయాలన్నారు. హౌసింగ్‌కు సంబంధించి లబ్ధిదారులు జియో ట్యాగింగ్ చేసుకొని తదుపరి నిర్మాణాలు ముందుకుసాగేందుకు పని చేయాలన్నారు. ఓటరుకార్డుకు ఆధార్ అనుసంధానం చేయాలన్నారు.

మట్టి పరీక్షలపై ముగిసిన శిక్షణ


మట్టి పరీక్షల గురించి వివరిస్తున్న మాస్టర్ ట్రైనీ ఆదిలక్ష్మి, ఏడీఏ రోజాపుష్పలత

అనంతపురం అగ్రికల్చర్: నియోజక వర్గ స్థాయి వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ ల్యాబ్స్ ఇన్‌చార్జ్‌లకు మట్టి సేకరణ, పరీక్షలు, విశ్లేషణ, ఫలితాల సమీక్షపై నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ముగిసింది. స్థానిక భూసార పరీక్షా కేంద్రం (సాయిల్ టెస్టింగ్ ల్యాబొరేటరీ-ఎస్‌టీఎల్) ఏడీఏ ఎల్.రోజాపుష్పలత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీలుగా సీనియర్ ఏఓలు ఆదిలక్ష్మి, రుమానాబేగం వ్యవహరించారు. రైతు సహకారంతో మట్టిని సేకరించే విధానం, దాన్ని సమీపంలో ఉన్న నియోజక వర్గ స్థాయి ప్రయోగశాలకు పంపించడం, ఆ తర్వాత నత్రజని, భాస్వరం, పొటాష్‌తో పాటు సూక్ష్మపోషకాల లభ్యతను గుర్తించడానికి చేయాల్సిన పరీక్షలు, విశ్లేషణ, అందుకు అనుగుణంగా ఎరువుల యాజమాన్యం సిఫార్సులపై అవగాహన కల్పించారు. త్వరలోనే జిల్లా వ్యాప్తంగా భూసార పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నందున రైతులు తమ పొలాల్లో ఉన్న పోషకాలను తెలుసుకొని సమగ్ర ఎరువుల యాజమాన్యం పాటించాలని ఏడీఏ తెలిపారు.

చైతన్య స్కూల్ విద్యార్థుల సత్తా


విద్యార్థులను అభినందిస్తున్న ఏజీఎం, ప్రిన్సిపాళ్లు

రాప్తాడురూరల్: అనంతపురం శ్రీచైతన్య పాఠశాలల విద్యార్థులు అమెరికా నాసా వారి ఎన్ఎస్ఎస్ స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్-2023లో సత్తా చాటారు. వివిధ దేశాల నుంచి నుంచి 138 ప్రాజెక్టులు ఎంపిక కాగా, వీటిలో 89 ప్రాజెక్టులు భారతదేశం నుంచి ఎంపికయ్యాయి. అందులో 54 ప్రాజెక్టులు చైతన్య విద్యాసంస్థల నుంచే ఎంపికయ్యాయని ఏజీఎం సుబ్బారెడ్డి తెలిపారు. అనంతపురం జోన్ గుంతకల్లు బ్రాంచ్ నుంచి ఒక ప్రాజెక్ట్ ఎంపికైందన్నారు. మంగళవారం స్థానిక కమ్మ భవన్ సమీపంలోని చైతన్య పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏజీఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ పటిష్టమైన ప్రణాళిక, అనుభవం కలిగిన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులు కష్టపడి ప్రాజెక్టులు సిద్ధం చేసి, నాసా వారికి పంపినట్లు తెలిపారు. 6వ తరగతి విద్యార్థి ఇషాక్ ఇమ్మానుయేల్, కాజా ఫక్రుద్దీన్, సుహాస్ యాదవ్, దిలీప్, 7వ తరగతి ఓంకార్ , మోహిత్, కార్తీక్, 8వ తరగతి అనిల్ కుమార్, దీరజ్ రెడ్డి ప్రాజెక్టులు గెలిచారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ విశ్వనాథ్, వీరేష్ బాబు, రాజేష్ బాబు, నారాయణస్వామి, కోఆర్డినేటర్స్ రాధాకృష్ణ నాయుడు, తిరుమలేష్, శ్రీనివాస్, డీన్ జాన్ విన్సంట్, నాసా ఇంచార్జ్ మస్తాన్ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాల మహోత్సవం


బోనాల ఉత్సవంలో పాల్గొన్న గ్రామస్తులు


ఊరేగింపుగా వెళ్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: చైత్రమాసంలో కనుల పండువగా సాగే గ్రామదేవత జాతరలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఐదో రోడ్డులో వెలసిన పెద్దమ్మ తల్లి ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా కనిపించాయి. వందలాదిగా తరలివచ్చిన మహిళలు అమ్మవారికి బోనాలను సమర్పించారు. బారులు తీరిన భక్తులతో రోడ్డు రద్దీగా మారింది. మధ్యాహ్నం భారీఎత్తున అన్నదాన కార్యక్రమం జరిగింది. రాత్రి జరిగిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, నిర్వాహకులు నాగరాజు, రంగ, నరసింహులు, బాబు, ఆంజనేయులు పాల్గొన్నారు.

రాప్తాడు: మండలంలోని అయ్యవారిపల్లి, గొందిరెడ్డిపల్లి, పాలచెర్ల, జి.కొత్తపల్లి గ్రామాల్లో పెద్దమ్మ, మారెమ్మ, సాలెమ్మ, పోతులయ్య స్వామికి ప్రజలు భక్తి శ్రద్ధలతో బోనాలు సమర్పించారు. శ్రీరామనవమి పండుగ తర్వాత జ్యోతులు, బోనాల మహోత్సవం జరుపుకోడం ఆనవాయితీ. తెల్లవారుజామున నుంచే అమ్మవారికి అభిషేకాలు, కుంకుమపూజ, ఆకుపూజ, అభిషేకం పూజలు చేశారు. అనంతరం భక్తులు అమ్మవారికి చీరలను కానుకలుగా సమర్పించారు. ఆయా గ్రామాల్లో అమ్మవారికి మేకలు, గొర్రెలు, పొట్టేళ్లు, కోళ్లను బలి ఇచ్చారు. సాయంత్రం యువతులు, మహిళలు, యువకులు వసంతోత్సవం జరుపుకున్నారు. యువకులు టెంకాయలు, చీనీ, నిమ్మ పండ్లు విసరే పందేలు ఆడారు.

ఉత్సాహంగా పోతలయ్యస్వామి పార్వేట

కనగానపల్లి: మండలంలోని వేపకుంటలో మంగళవారం పోతలయ్యస్వామి పార్వేట ఉత్సవాన్ని గ్రామస్తులు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోతలయ్యస్వామి భక్తులు పోతలయ్యస్వామికి సమర్పించి పూజలు చేశారు. సాయంత్రం పోతలయ్యస్వామి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పొలిమేరల్లోకి ఊరేగింపుగా తీసుకెళ్లి, అక్కడ పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని యువకులు వేటకు వెళ్లి తీచ్చిన కుందేళ్లను ఆలయం ఎదుట జనంమధ్యలో వదిలారు. ఆతర్వాత పార్వేట నిర్వహించారు.

వ్యాఘ్ర వాహనంపై కోదండరాముడు దర్శనం



అనంతపురం కల్చరల్: స్థానిక మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండరామాలయంలో శ్రీరామచంద్రా నమో నమః అంటూ భక్తుల పారవశ్యం నడుమ శ్రీరామనవమి ఉత్సవాలు జరిగాయి. మంగళవారం ఉదయం అభిషేకాలు, అలంకార సేవలందుకున్న శ్రీసీతా కోదండరాముడు రాత్రి వ్యాఘ్రువాహనంపై ఊరేగి దర్శనమిచ్చారు. భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చి మోహినీ అలంకారంలో కొలువుదీరిన సీతారాములను దర్శించుకున్నారు. సాంస్కృతిక సంబరాలు ఆకట్టుకున్నాయి. ఆలయ ఈవో సుధారాణి, ధర్మకర్తల మండలి సభ్యులు తిమ్మారెడ్డి, వెంకటస్వామి, సురేష్, చంద్ర తదితరులు ఉత్సవ సేవల్లో పాల్గొన్నారు.

నూతన అంశాల అధ్యయనం అనివార్యం


సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న డైరెక్టర్ ఈశ్వర్ రెడ్డి

అనంతపురం: మార్కెట్ అవసరాలకనుగుణంగా ఎప్పటికప్పుడు నూతన అంశాలను అధ్యయనం అనివార్యమని జేఎన్‌టీయూ అనంతపురం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ బి. ఈశ్వర్‌రెడ్డి అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలోని కంప్యూటర్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో ' ఇంట్రడక్షన్ టు ఎంఎల్, ఎన్ఎల్‌పీ అండ్ చాట్ బాట్స్' (ఎఫ్‌డీపీ) అనే అంశంపై ఐదు రోజులుగా నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం మంగళవారం ముగిసింది. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థీ, అధ్యాపకులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సదస్సు కోఆర్డినేటర్ డాక్టర్ పి. చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎస్ఆర్ఐటీ కళాశాల వార్షికోత్సవం



బహుమతులు అందిస్తున్న రెక్టార్ విజయ్‌కుమార్, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డి


విద్యార్థులతో కరచాలనం చేస్తున్న సినీహీరో కిరణ్ అబ్బవరం, అతుల్యా రవి

బుక్కరాయసముద్రం: రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో 15వ కళాశాల వార్షికోత్సవం ఉత్సాహంగా సాగింది. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమానికి ఆర్‌జీయుకేటీ, జేఎన్‌టీయూ రెక్టార్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్, కళాశాల చైర్‌పర్సన్, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, కరెస్పాండెంట్ ఆలూరు సాంబశివారెడ్డి హాజరయ్యారు. కళాశాలలో బ్రాంచ్ టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు, ఉత్తమ సేవలు అందించిన అధ్యాపకులకు బహుమతులను అందజేశారు. అనంతరం కళాశాలలో సినీ హీరో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ అతుల్యా రవి సందడి చేశారు. మీటర్ సినిమా ట్రైలర్ విడుదల చేశారు.

నీటి సమస్య రానివ్వొద్దు

అనంతపురం క్రైం: నీటి సమస్య రానివ్వకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ సిబ్బందిని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం నగరంలోని 28వ డివిజన్‌లోని అశోక్‌నగర్‌లో ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో కొందరికి నీటి సమస్య ఉందని చెప్పడంతో సంబంధిత అధికారులకు ఆయన ఫోన్ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు రవీంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.